సాక్షి విజయనగరం

శనివారం, 2, నవంబర్, 2024



ఇంత అలసత్వమా..! - 8లో

అత్యవసర వేళ ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు సేవలందించడంలో సిబ్బంది అలక్ష్యం చేస్తున్నారు. పెద్దాస్పత్రులకు రిఫర్ చేస్తూ ఆవేదన, ఆందోళనకు గురిచేస్తున్నారు.



రూ.60 లక్షల ఆస్తి నష్టం

దీపావళి పండగ రోజున చీపురుపల్లిలోని ఆటోమొబైల్ దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు రూ.60లక్షల ఆస్తి నష్టం జరిగింది. - 8లో



సీఎం గారూ.. గుర్ల గెడ్డ గుర్తుందా...!

మెంటాడ మండలంలోని గుర్ల గెడ్డ ప్రాజెక్టు పూర్తికి ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి కోరారు. - 8లో

న్యూస్‌రీల్

4న శాప్ చైర్మన్ జిల్లాకు రాక

విజయనగరం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఈ నెల 4న విజయనగరంలో పర్యటించనున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు నగర శివారులోని విజ్జి స్టేడియం, అనంతరం నగరం నడిబొడ్డున గల రాజీవ్ స్టేడియంలను పరిశీలిస్తారన్నారు. మైదానాల్లో మౌలిక సదుపాయాలు పర్యవేక్షించాక జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సిబ్బంది, రాజకీయ నాయకులు, క్రీడా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

మెరిట్ జాబితా విడుదల

విజయనగరం అర్బన్: జిల్లాలోని కేజీబీవీ విద్యాలయాల్లో భర్తీ చేస్తున్న పోస్టులకు మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు డీఈఓ యు.మాణిక్యంనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితా పై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా శనివారంలోగా కలెక్టరేట్‌లోని సర్వ శిక్ష కార్యాలయానికి లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

10న డీఎస్సీ ఉచిత శిక్షణ పరీక్ష

విజయనగరం అర్బన్: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు స్క్రీనింగ్ పరీక్ష ఈ నెల 10న నిర్వహిస్తామని ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి రామానందం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రకటించిన 3వ తేదీన పరీక్ష నిర్వహించడంలేదని, ఈ మార్పును దరఖాస్తుదారులు గమనించాలని కోరారు.

డయేరియా బాధిత కుటుంబాలకు..
వైఎస్సార్‌సీపీ ఆపన్నహస్తం

- మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన సాయం నేడు అందజేత
- 13 కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున మంజూరు
- చెక్కులు అందజేయనున్న జెడ్పీ చెర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల/చీపురుపల్లి: ప్రభుత్వ నిర్లక్ష్యంతో డయేరియాతో మృతి చెందిన కుటుంబాలను ఆదుకునేందుకు వైఎస్సార్‌సీపీ ముందుకొచ్చింది. గుర్లలో డయేరియా బాధిత కుటుంబాలను గత నెల 24న పరామర్శించిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి... మృతుల కుటుంబాలను ఆదుకుంటామని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి వైఎస్సార్‌సీపీ తరఫున రూ.2 లక్షల చొప్పున అందజేస్తామని ప్రకటించారు. మాట ఇచ్చిన పదిరోజులు గడవకముందే బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం పంపించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన చెక్కులను శనివారం బాధిత కుటుంబాలకు పంపిణీ చేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

బొత్స చేతుల మీదుగా నేడు చెక్కుల పంపిణీ

గుర్ల మండల కేంద్రంలో 10 మంది, కోటగండ్రేడులో ఒకరు, నాగళ్లవలసలో ఇద్దరు డయేరియాతో మృతి చెందారు. మొత్తం 13 మంది కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున వైఎస్సార్ సీపీ మంజూరు చేసింది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు గుర్ల మండల కేంద్రంలో 10 కుటుంబాలకు, 4 గంటలకు కోటగండ్రేడులో ఒక కుటుంబానికి, సాయంత్రం 4.30 గంటలకు నాగళ్లవలసలో రెండు కుటుంబాలకు శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ చెక్కులు అందజేయనున్నారు.

ఇంతోటి రోడ్డుకు అంతోటి హంగామా!

రోడ్డు మరమ్మతులకు మంజూరైనది రూ.38 లక్షలు | ముఖ్యమంత్రి పర్యటనకు ఖర్చు సుమారు రూ.50 లక్షలు



సీఎం చంద్రబాబు మరమ్మతు పనులు ప్రారంభించనున్న గజపతినగరం- మెంటాడ రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్‌జిందాల్

- గజపతినగరం–మెంటాడ రోడ్డు మరమ్మతులకు నేడు శ్రీకారం
- ప్రారంభానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా రాక
- రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మతులకు ఇక్కడి నుంచే పచ్చజెండా

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రులనే ఇప్పటివరకూ చూసి ఉంటాం. కానీ నిరంతర ప్రక్రియగా సాగే రోడ్ల మరమ్మతులను ఒక ప్రారంభోత్సవంలా చేసే ముఖ్యమంత్రిని ఇప్పుడిక్కడ చూడబోతున్నాం. గజపతినగరం మండల కేంద్రం నుంచి మరో మండల కేంద్రమైన మెంటాడ వరకూ సుమారు పది కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రెండు మండల కేంద్రాల మధ్య 2018 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలోనే కొత్తగా రోడ్డు వేశారు. అది కొద్ది రోజుల్లోనే పాడైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత విశాఖ–రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సుబ్బి పెళ్లి వెంకి చావుకు వచ్చినట్లుగా ఆ రోడ్డు నిర్మాణానికి అవసరమైన సామగ్రి అంతా భారీ వాహనాల్లో ఈ రోడ్డుపైనే సాగింది. దీంతో రోడ్డు పూర్తిగా శిథిలమైంది. దాన్ని బాగు చేయించాలని నాటి గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ప్రయత్నించారు. అయితే గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ సంస్థ అధికారులు మాత్రం ఆ రోడ్డు మరమ్మతు బాధ్యతలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆయన వెనక్కుతగ్గారు. ఇప్పుడా రోడ్డు మరమ్మతు పనులకు రూ.38 లక్షలు మంజూరయ్యాయి. ఆ పనులను శనివారం ప్రారంభించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా జిల్లాకు వస్తున్నారు. ఆయన పర్యటనకు అధికార యంత్రాంగం అధికారికంగా, అనధికారికంగా చేస్తున్న ఖర్చు రూ.50 లక్షలు!

● వేదిక మారింది అందుకేనా?

రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులను విజయనగరం జిల్లా నుంచి ప్రారంభించాలనేది టీడీపీ కూటమి నాయకుల ఉద్దేశం. తొలుత శృంగవరపుకోట నియోజకవర్గంలో కొత్తవలసలో ఈ కార్యక్రమం చేయాలని భావించారు. అయితే భారీగా ఖర్చు అవుతుందంటే... అంత తాను భరించలేనని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చేతులెత్తేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, షాడో మంత్రిగా పనిచేస్తున్న ఆయన తండ్రి కొండపల్లి కొండబాబు ముందుకొచ్చారట. ఆగమేఘాలపై గజపతినగరం మండలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు చేశారు. గజపతినగరం మండల కేంద్రం నుంచి మెంటాడ మండల కేంద్రం వరకూ సుమారు పది కిలోమీటర్ల పొడవున తలపెట్టిన మరమ్మతులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్‌బీ రోడ్ల మరమ్మతులకూ ఇక్కడి నుంచే పచ్చజెండా ఊపబోతున్నారు.

● ఆగమేఘాలపై ఏర్పాట్లు...

గజపతినగరం వద్ద జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 26) నుంచి మెంటాడ గ్రామం వరకు గల ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.38 లక్షలను మంజూరుచేసింది. ఈ పనులకు సీఎం చంద్రబాబు శనివారం తన పర్యటనలో భాగంగా పురిటిపెంట గ్రామం వద్ద శంకుస్థాపన చేయనున్నారు. వాస్తవానికి ఈ రోడ్డు గజపతినగరం నుంచి ఆంద్ర వరకు సుమారు 18 కిలోమీటర్లు ఉంది. కానీ మెంటాడ వరకు సుమారు 10 కిలోమీటర్ల వరకే మరమ్మతులు చేస్తారు. ఈ అరకొర పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి స్థాయి నాయకుడు ఇదే ప్రథమమని రాజకీయ వర్గాల్లో నవ్వులు విరుస్తున్నాయి.

● పెద్ద రోడ్డు పనులతో గుంతలు...

విశాఖపట్నం–రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి అవసరమైన సామగ్రి అంతా భారీ వాహనాల్లో గజపతినగరం–మెంటాడ రోడ్డు మీదుగానే తరలిస్తున్నారు. ఫలితంగా గత మూడేళ్లలో దీనికి పలుచోట్ల గుంతలు పడ్డాయి. అలాగే గంట్యాడ మండలంలోని కోటారుబిల్లి, బొండపల్లి మండలంలోని కొండవానిపాలెం గ్రామాల వద్ద ఏర్పాటుచేసిన మెటీరియల్ తయారీ ప్లాంట్ల నుంచి నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఒక్కోసారి అవికూడా ఆ గోతుల్లోకి దిగిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఆ గోతులను తాత్కాలికంగా పూడ్చి మళ్లీ వాహనాలను తిప్పేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చాలా రోడ్లకు మరమ్మతులు జరిగాయి. కొన్నిచోట్ల కొత్త రోడ్లనూ నిర్మించారు. దీంతో గజపతినగరం–మెంటాడ రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించడానికి నాటి గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు మాత్రం ఆ రోడ్డుకు తామే మరమ్మతు చేయిస్తామని, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులు పూర్తి అయినవెంటనే ఆ కార్యక్రమం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఇప్పుడు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం దాదాపుగా పూర్తి అయ్యింది. ఆ నిర్మాణ సంస్థ వాహనాల రాకపోకలు కూడా బాగానే తగ్గిపోయాయి. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వంలో చేపట్టిన రోడ్ల మరమ్మతుల్లో భాగంగా గజపతినగరం నియోజకవర్గంలో అదీ అత్యధికంగా రూ.38 లక్షలు మంజూరైన ఏకైక రోడ్డు గజపతినగరం–మెంటాడ రోడ్డు మాత్రమే. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వాహనాలతో దెబ్బతిన్న మరో రోడ్డు (కోటారుబిల్లి జంక్షన్ నుంచి బుడతనాపల్లి వరకూ) మరమ్మతులు ఈ దఫా లేనట్లే. జిల్లాలో మొత్తం 80 కిలోమీటర్ల మేర 73 మరమ్మతు పనులు రూ.10.50 కోట్లతో చేపట్టనున్నారు.

● ముఖ్యమంత్రి పర్యటన ఇలా...

ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఉదయం 11 గంటలకు జిల్లాకు రానున్నారు. గజపతినగరం మండలంలోని గంగచోళ్లపెంట గ్రామం వద్ద హెలిప్యాడ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. పురిటిపెంట వద్ద గజపతినగరం–మెంటాడ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా రూ.826 కోట్లతో ఆర్ అండ్‌బీ రహదారుల మరమ్మతులనూ సీఎం ప్రారంభిస్తారు. ఈ పర్యటన ఏర్పాట్లను శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ పరిశీలించారు.

● పటిష్ట బందోబస్తు

విజయనగరం క్రైమ్: సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. గంగచోళ్ల పెంట వద్ద ప్రత్యేక హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్, రూట్ బందోబస్తు, రూఫ్‌టాప్, భద్రతా ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి బందోబస్తు విధులపై దిశానిర్దేశం చేశారు. బందోబస్తు విధులకు సుమారు వెయ్యి మంది పోలీసులను నియమించామన్నారు. శనివారం గజపతినగరం నుంచి మెంటాడ వెళ్లే అన్ని వాహనాలను మధుపాడ, భూదేవిపేట, కొత్తబగ్గాం, పాతబగ్గాం మీదుగా మళ్లిస్తామన్నారు. ఓలం కూడలి నుంచి బంగారమ్మ పేట, చల్లపేట మీదుగా మెంటాడ వెళ్లాలని, మెంటాడ నుంచి వచ్చే వాహనాలు కొణిశ కూడలి నుంచి గజపతినగరానికి మళ్లిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



సీఎం పర్యటన బందోబస్తుకు హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది

● దీపావళి సంబరాలు



సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో దీపావళి సంబరాలను దేవస్థాన అర్చకులు, సిబ్బంది గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారి ప్రాతఃకాలార్చన పూజలనంతరం యాగశాలలో ప్రత్యేక హోమాలు, స్వామివారి వెండి మండపం వద్ద సీతారాముల కల్యాణాన్ని వేడుకగా జరిపించారు. దీపావళి సందర్భంగా ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలను వెలిగించి మతాబులు కాల్చారు. సంప్రదాయాలను ప్రతి ఒక్కరు పాటించాలని అర్చకులు పిలుపునిచ్చారు. – నెల్లిమర్ల రూరల్

● మార్గనిర్దేశం



వేపాడ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు చదువు ప్రణాళికపై మార్గనిర్దేశం చేస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వచ్చే ఏడాది జరగబోయే పదో తరగతి పరీక్షలకు ఇప్పటినుంచే సన్నద్ధం కావాలని, సమయం వృథా చేయకుండా చదువుపై ధ్యాసపెంచాలని వేపాడ మండల ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు విద్యార్థులకు సూచించారు. వేపాడ, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం సందర్శించి చదువు ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. చక్కని బోధనతో పాటు రుచికరమైన భోజనం వడ్డించేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంలు ఎస్ఎస్ వల్లీ, బీపీఏ రాజుకు సూచించారు. – వేపాడ

మంచం పట్టిన ఎరుకొండ



పూసపాటిరేగ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఎరుకొండ గ్రామానికి చెందిన డయేరియా బాధితులు

- డయేరియాతో ఒకరి మృతి
- ఆస్పత్రిలో చేరిన 12 మంది గ్రామస్తులు

పూసపాటిరేగ: మండలంలోని ఎరుకొండ గ్రామంలో డయేరియా ప్రబలింది. తీవ్ర అస్వస్థతకు గురై ఒకరు మృతి చెందగా, మరో 12 మంది పూసపాటిరేగ పీహెచ్‌సీ, సుందరపేట సీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్నారు. ఆస్పత్రిలో మృతిచెందిన పచ్చిపులుసు వెంకట రమణ (75) గత కొంత కాలంగా వృద్ధాప్యంతో పాటు ఇతర వ్యాధులతో ఇబ్బంది పడుతున్నట్లు వైద్యులు తెలిపారు. డయేరియాకు కారణాలపై ఆరా తీస్తున్నారు. తాగునీటి బోర్లు, రక్షిత మంచినీటి పథకం నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు ల్యాబ్‌కు పంపించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌శంకర్ తెలిపారు. గ్రామాన్ని జిల్లావైద్యారోగ్యశాఖ అధికారి భాస్కరరావు, తహసీల్దార్ తాడ్డి గోవింద, ఎంపీడీఓ ఎం.రాధిక, వైద్యాధికారి రాజేష్‌వర్మలు శుక్రవారం సందర్శించారు. మురుగునీటి కాలువలు, తాగునీటి వనరులను శుభ్రం చేయాలని స్థానిక సిబ్బందికి సూచించారు. వైద్యాధికారులు కడగల త్రినాథ్, ఎస్.ప్రమీలాదేవి, సర్పంచ్ గొట్టాపు అప్పలస్వామి, వైద్య సిబ్బంది ఆర్.వి.రమణ, జి.బంగారుబాబు తదితరులు గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో సేవలందించారు.

నెల్లిమర్ల కూటమిలో కుంపటి



నెల్లిమర్లలో జరిగిన టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు

- నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే పై టీడీపీ నేతల తిరుగుబాటు
- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం
- తెరపైకి 'క్విట్ నెల్లిమర్ల' నినాదం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

టీడీపీ, జనసేన కూటమి నేతల మధ్య అనుబంధాలు మూన్నాళ్లముచ్చటగానే మిగిలాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఈ రెండు పార్టీ నాయకుల మధ్య కుమ్ములాటలు తారస్థాయికి చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎమ్మెల్యే లోకం నాగమాధవి, టీడీపీ నేతల మధ్య కోల్డ్ వార్ నడుస్తూ వస్తోంది. ఇటీవల జరిగిన పరిణామాలతో అంతర్గత విభేదాలు కాస్తా రోడ్డెక్కాయి. దీనికి తొలుత నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశం వేదికైంది. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే వ్యవహార శైలిపై కర్రోతు బంగార్రాజు గట్టిగానే ప్రతి ఘటించడంతో వారి మధ్య విభేదాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం నెల్లిమర్ల పట్టణంలో టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. ఒక్కో టీడీపీ నాయకుడు ప్రసంగిస్తూ ఎమ్మెల్యేపై మాటల యుద్ధం చేశారు. ఎమ్మెల్యేను తిట్టడం, తిట్టించడమే లక్ష్యంగా సమావేశం మొత్తం కొనసాగింది. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. టీడీపీ అధికారంలో ఉన్నా.. లేనట్లే ఉన్నామని, అడుగడుగునా ఎమ్మెల్యే తమను అవమానపరుస్తున్నారంటూ మండిపడ్డారు. ఆమె ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి రాలేదని, మిరాకిల్‌సంస్థ స్వాధీనంలో ఉన్న 30 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడుకునేందుకు వచ్చారని కొందరు, ఎమ్మెల్యే తక్షణమే రాజీనామా చేయాలంటూ మరికొందరు తిట్ల దండకం అందుకున్నారు. ఆమె కంటే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే తమకి విలువ ఉండేదని, అధికారులు ప్రొటోకాల్ ప్రకారం తమను ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానం పలికేవారంటూ గ్రామ స్థాయిలో ఉన్న పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గుర్తు చేసుకున్నారు. 'క్విట్ నెల్లిమర్ల–సేవ్ నెల్లిమర్ల' నినాదాలతో జనసేనను పూర్తిగా బహిష్కరించే ఉద్దేశ్యమే కనిపిస్తోంది. ఈ సభలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, కీలక నాయకులు, కార్యకర్తలు హాజరై తమకి జరుగుతున్న అన్యాయాలను ఉదాహరణలతో సహా వివరించారు.

ఎమ్మెల్యే చిచ్చుపెడుతున్నారు: కర్రోతు

ఎమ్మెల్యే లోకం నాగమాధవికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మార్కెఫెడ్ కమిటీ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడారు. గెలిచిన 20 రోజుల్లోనే ఎమ్మెల్యే తమని దూరం పెట్టిందని ఆవేదన చెందారు. వెంటనే మంత్రి నారాలోకేశ్‌ను కలిసి పరిస్థితిని వివరిస్తే 20 రోజుల్లో ఏమి తెలిసిపోయిందంటూ నారా లోకేశ్ తనని ప్రశ్నించారని గుర్తు చేశారు. తహసీల్దార్లు, ఎస్ఐ, సీఐల బదిలీల విషయంలో ఎమ్మెల్యేను కలిస్తే..జాబితాలు ఇవ్వాలని సూచించారని, తీరా తమకి నచ్చిన వారి పేర్లు ఇస్తే వాటిని పక్కన పెట్టి ఆమెకు నచ్చిన వాళ్లని తెప్పించుకొని అవమానించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్వోలు, కార్యదర్శుల బదిలీల విషయంలో కూడా అదే జరిగిందని, టీడీపీ నాయకులకు ఏ అధికారి పనిచేయకూడదనే లక్ష్యాన్ని ఆమె పెట్టుకుందని దుయ్యబట్టారు. టీడీపీ నేతలతో అతి తెలివిని ప్రదర్శిస్తూ మా మధ్యే చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.



జనసేన ఎమ్మెల్యేను బంగాళాఖాతంలో కలిపేద్దాం

- ఎమ్మెల్యే నాగమాధవిపై యుద్ధం ప్రకటించిన టీడీపీ నాయకులు

నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్: చంద్రబాబు ఆదేశాలతో గ్రామాల్లో కష్టపడి పనిచేసి జనసేన అభ్యర్థి లోకం నాగమాధవిని మంచి మెజార్టీతో నెల్లిమర్ల ఎమ్మెల్యేగా గెలిపించాం.. ఆమె ఒంటెద్దు పోకడలతో టీడీపీ శ్రేణులను ఇబ్బందిపెడుతున్నారు.. టీడీపీ నాయకులు చెప్పిన పనులు చేయవద్దంటూ అధికారులకు సూచిస్తున్నారు.. ఆమెతో మరి వేగలేం.. అంతా ఏకతాటిపై నడిచి ఆమెను బంగాళాఖాతంలో కలిపేద్దామంటూ నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు బహిరంగ విమర్శలు చేశారు. ఇప్పటివరకు దుఃఖాన్ని దిగమింగుతూ వచ్చామని, మరి ఎమ్మెల్యేతో వేగలేమని నెల్లిమర్ల మండల కేంద్రం వేదికగా శుక్రవారం జరిగిన టీడీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో స్పష్టంచేశారు. పాత్తుధర్మాన్ని ఎమ్మెల్యే విస్మరించారంటూ మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మండిపడ్డారు. టీడీపీలో ఉన్న కొంతమంది నాయకులకు పనులు అప్పగించి తెలివిగా తమలో తమకు చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. టీడీపీ నియోజకవర్గ నేత కంది చంద్రశేఖర్ అధికారులకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. నియోజకవర్గంలో ఒక్క జనసేన, బీజేపీ నాయకులే లేరని, టీడీపీ నాయకులు, కార్యకర్తలను నిర్లక్ష్యం చేసి ఒకే మాటపై అధికారులు వెళితే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. ఎమ్మెల్యే నియంతలా వ్యవహరిస్తున్నారని, తీరు మార్చుకోపోతే ఊరుకోబోమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, టీడీపీ నేతలు సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్, పతివాడ అప్పలనారాయణ, శంకర్రావు, కర్రోతు సత్యన్నారాయణ, మహంతి చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వెండర్ విధానం వద్దు

- హైకోర్టును ఆశ్రయించిన సర్పంచ్‌లు

రేగిడి: పంచాయతీల్లో సర్పంచ్‌ల అధికారాలను కాలరాస్తూ.. ఉపాధిహామీ పనులను వెండర్ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడాన్ని సర్పంచ్‌లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా రేగిడి మండలంలోని లక్ష్మీపురం, ఆమదాలవలస, మునకలవలస గ్రామాల సర్పంచ్‌లు హైకోర్టును ఆశ్రయించారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా వెండర్ విధానంలో అధికార పార్టీకి చెందిన నాయకులకు అప్పగించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు.

భయపెడుతున్న గజరాజులు



పార్వతీపురం టౌన్: దిబ్బగుడ్డివలసలో గజరాజులు సంచరిస్తూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. పార్వతీపురం మండలంలోని సంగంవలస, దిబ్బగుడ్డివలస, పెదబొండపల్లి గ్రామాల పొలాల్లో గత రెండు రోజులుగా సంచరిస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళ పొలాలకు వెళ్లవద్దని అటవీ శాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. పలు గ్రామాల్లో శుక్రవారం దండోరా వేయించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడుని రోడ్డు సేఫ్టీ వాహనంలో పీహెచ్‌సీకి తరలిస్తున్న పోలీసులు

కొత్తవలస : అరకు – విశాఖ జాతీయ రహదారిలో తుమ్మికాపల్లి గేటు సమీపంలో అగ్నిమాపక కేంద్రం వద్ద శుక్రవారం ఉదయం కారును స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే... గాజువాకకు చెందిన ఎల్.వాసు తన స్నేహితులతో కలిసి అరకు అందాలు చూసేందుకు వెళ్తున్నాడు. నలుగురు యువకులు ఎవరి వాహనంపై వారే ప్రయాణం చేస్తున్నారు. ఈ క్రమంలో అగ్నిమాపక కేంద్రం సమీపంలోకి వచ్చేసరికి ముందు వెళ్తున్న కారు యూటర్న్ చేస్తున్న క్రమంలో వాసు తన స్కూటీతో కారు వెనుకభాగంలో బలంగా ఢీకొట్టాడు. దీంతో వాసు కుడి కాలు విరిగిపోయింది. తలకు బలమైన గాయం తగిలింది. స్థానికులు, స్నేహితులు వెంటనే 108 వాహనానికి సమాచారం ఇవ్వగా స్పందించలేదు. చివరకు రోడ్డు సేఫ్టీ వాహనంలో పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ పాపారావు, డ్రైవర్ చంద్రశేఖర్ క్షతగాత్రుడు వాసును తమ వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించారు.

ఏసీబీ విజిలెన్స్ అవేర్‌నెస్



విద్యార్థులతో అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

విజయనగరం క్రైమ్: అవినీతి నిరోధక శాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులతో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ సీఐ మహేశ్వరరావు మాట్లాడుతూ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ప్రతీ రోజూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వాల్‌పోస్టర్లను అంటించి, ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏసీబీ అధికారి ఎమ్.మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు



నుజ్జయిన ఆర్టీసీ బస్సు వెనుక భాగం

విజయనగరం క్రైమ్: విజయనగరం నుంచి మెరకముడిదాం వెళ్తున్న ఆర్టీసీ బస్సును ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొంది. స్థానిక ఫూల్‌బాగ్ కాలనీ అయ్యప్పనగర్ వద్ద స్పీడ్ బ్రేకర్‌ను ఆర్టీసీ బస్సు దాటుతుండగా, వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు బలంగా ఢీకొంది. దీంతో ఆర్టీసీ బస్సు వెనుక భాగం, ట్రావెల్ బస్సు ముందు అద్దాలు పగిలిపోయాయి. బస్సులో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదని టూటౌన్ పోలీసులు తెలిపారు. స్పీడ్ బ్రేకర్‌ను దాటుతుండగా ట్రావెల్ బస్సు సడన్‌గా ఢీకొట్టడంతో ఒక్కసారిగా ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

రామతీర్థంలో వైభవంగా సహస్ర దీపారాధన



స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవను ఆలయ అర్చకులు శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. తూర్పు రాజగోపురం సమీపంలోని వేదికపై ఉన్న ప్రత్యేక ఊయలలో సీతారామ చంద్ర స్వామిని ఆశీనులు చేసి సహస్ర దీపాల కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపించారు. సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు భక్తి శ్రద్ధలతో సహస్ర దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230

ఇంత అలసత్వమా..!

- సాధారణ ప్రసవాలు జరిగే అవకాశం ఉన్నా.. రిఫర్ చేస్తున్న వైద్య సిబ్బంది
- క్లిష్టమైన ప్రసవాలు 108 సిబ్బంది చేస్తున్న వైనం
- జనవరి నుంచి అక్టోబర్ వరకు 108లో 42 ప్రసవాలు

☛ కొద్ది రోజుల క్రితం ప్రసవం కోసం ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో జె.స్వప్న చేరింది. ఆమెను అక్కడ వైద్యులు విజయనగరం ఘోషాస్పత్రికి రిఫర్ చేసారు. దీంతో వారి కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసారు. సమాచారం అందుకున్న వెంటనే ఎస్.కోట ఆస్పత్రిలో ఉన్న గర్భిణి స్వప్నను ఘోషాస్పత్రికి తరలిస్తుండగా కాపు సోంపురం వద్దకు వచ్చే సరికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 ఈఎంటీ పి.వి.రమణ అంబులెన్సును పక్కన ఆపి ప్రసవం జరిపించారు. ఆమెకు పండంటి ఆడ శిశువు జన్మించింది.

☛ అనంతగిరి మండలం కొత్తరూకు చెందిన వంతల వనజకు పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్సుకు ఫోన్ చేసారు. సమాచారం అందుకున్న తర్వాత 108 సిబ్బంది గ్రామానికి చేరుకుని గర్భిణి వనజను ఎస్.కోట ఏరియా ఆస్పత్రి తరలిస్తుండగా మార్గ మాధ్యలో పురిటి నొప్పులు రావడంతో 108అంబులెన్స్ ఈఎంటీ మౌనిక గర్భిణి వనజకు ప్రసవం జరిపించారు. ఆమెకు ఆడశిశువు జన్మించింది.



ఎస్.కోట ఆస్పత్రి నుంచి రిఫర్ చేయగా మార్గ మధ్యలో ప్రసవం జరిపించిన 108 సిబ్బంది(ఫైల్)



అనంతగిరి నుంచి కొత్తరూకు చెందిన గర్భిణికి మార్గ మధ్యలో ప్రసవం జరిపించిన 108 సిబ్బంది(ఫైల్)

విజయనగరం ఫోర్ట్: ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రి, సీహెచ్‌సీ వైద్యులు క్లిష్టతరమని రిఫర్ చేసిన గర్భిణులకు 108 అంబులెన్స్ సిబ్బంది ఎంతో సులువుగా ప్రసవాలు జరిపించేస్తున్నారు. ఆస్పత్రి వైద్యులు సిజేరియన్ అవ్వాలని రిఫరల్ ఆస్పత్రికి రిఫర్ చేసిన కేసులను సైతం 108 సిబ్బంది చాకచక్యంగా ప్రసవాలు చేయడం ఇక్కడ గమనించదగ్గ విషయం.

విచారణ చేపడతాం..

సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల నుంచి రిఫరల్ ఆస్పత్రులకు ఎందుకు గర్భిణులను రిఫర్ చేస్తున్నారనే దానిపై విచారణ చేపడతాం. ప్రసవం చేయగలిగే అవకాశం ఉన్న కేసులను రిఫర్ చేస్తే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ బి.రాజ్యలక్ష్మి, డీసీహెచ్ఎస్

రిఫరల్స్‌కే ప్రాధాన్యమిస్తున్న ఆస్పత్రులు

సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులకు ఎక్కువగా గర్భిణులు ప్రసవం కోసం వస్తారు. అక్కడ వైద్య సిబ్బంది ప్రసవాలు చేయడంలో అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రసవాలు అయ్యే గర్భిణులను సైతం ఘోషాస్పత్రికి, కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా రిఫర్ చేసే కేసులను రిఫరల్ ఆస్పత్రులకు తరలించే సమయంలో మార్గమధ్యలో 108 సిబ్బంది ప్రసవాలు నిర్వహిస్తున్నారు. జనవరి నెల నుంచి అక్టోబర్ నెలఖారు వరకు 108 అంబులెన్సులలో 42 ప్రసవాలు జరిగాయి. ప్రతి నెల 108 అంబులెన్సులో ప్రసవాలు జరుగుతున్నాయి.

108లో జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన ప్రసవాల వివరాలు..

నెల	ప్రసవాల సంఖ్య
జనవరి	06
ఫిబ్రవరి	01
మార్చి	04
ఏప్రిల్	01
మే	09
జూన్	04
జూలై	06
ఆగస్టు	03
సెప్టెంబర్	04
అక్టోబర్	04

సీఎం గారూ.. గుర్ల గెద్ద గుర్తుందా...!

- సీపీఎం జిల్లా కార్యదర్శి లక్ష్మి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

గజపతినగరం: మెంటాడ మండలంలో అతి చిన్న ప్రాజెక్ట్ అయిన గుర్ల గెద్ద ప్రాజెక్ట్ గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి కోరారు. పురిటిపెంటలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. మెంటాడ మండలం గుర్ల గెద్ద ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తిగా జరగకపోవడంతో అది నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. చంద్రబాబు హయాంలో ప్రాజెక్ట్ శంకుస్థాపన జరిగి 20 ఏళ్లు దాటిందని పనులు మధ్యలో నిలిపి వేశారని అన్నారు. స్పిల్‌వే నుంచి కొండకు గట్టు పూర్తి చేయకపోవడంతో ప్రాజెక్ట్‌లో నీరు నిల్వ లేకుండా పోతుందని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆ పనులను పూర్తి చేయాలని కోరారు. ముందు ఫారెస్ట్ క్లియరెన్స్ పనులు జరిగేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో అనేక ప్రాజెక్ట్‌లను దశాబ్దాలుగా కట్టడం జరుగుతుందని జిల్లాలో తోటపల్లి పెదగెద్ద ప్రాజెక్ట్‌కు, పోలవరం ప్రాజెక్ట్‌లకు ఫారెస్ట్ ల్యాండ్లు ఉన్నాయని చెప్పారు. వీటి నిర్మాణానికి బాధ్యత తీసుకున్న ప్రభుత్వాలు వెనుకబడి ఉన్న ఉత్తరాంధ్రలో విజయనగరం జిల్లాలో ఉన్న అతి చిన్న గుర్ల గెద్ద ప్రాజెక్ట్‌ను పరిశీలించి నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టి రైతులకు మేలు చేయాలని విన్నవించారు. ఆమెతో పాటు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్, మెంటాడ మండలం కార్యదర్శి రాకోటి రాములు తదితరులు ఉన్నారు.

డీఆర్ఓ సేవలు మరువలేనివి



బదిలీపై వెళ్తున్న కేశవనాయుడును సత్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లా రెవెన్యూ అధికారిగా జి.కేశవనాయుడు అందించిన సేవలు మరువలేనివని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. అనంతపురం బదిలీపై వెళ్తున్న కేశవనాయుడుకు కలెక్టర్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డీఆర్ఓ అంకిత భావంతో పనిచేసి ఈ ప్రాంతీయుల మన్ననలను పొందారన్నారు. సిబ్బందికి మార్గదర్శకం వహించడంలోను పై అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వడంలోను సమన్వయం చేశారన్నారు.

ఎన్నికల వేళ చాకచక్యంగా పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకు వచ్చారన్నారు. బదిలీపై వెళ్తున్న కేశవనాయుడు మాట్లాడుతూ జిల్లాలో పని చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి ఎండీ గయాజుద్దీన్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి ఎల్.రమేష్, కలెక్టర్ పరిపాలన అధికారి సావిత్రి, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో నగర విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

విజయనగరం: ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ – 2024లో విజయనగరం పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులకు పతకాలు లభించాయి. ఈ మేరకు పట్టణానికి చెందిన కరాటే కోచ్ కానూరు సంతోష్‌కుమార్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ విషయం వెల్లడించారు. విశాఖ సిటీ వేపగుంటలో గల శ్రీకృష్ణ దేవరాయ కమ్యూనిటీ హాల్‌లో అక్టోబరు 27 నుంచి మూడు రోజుల పాటు జరిగిన శ్రీ గంటా కనకారావు మెమోరియల్ రాష్ట్ర ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ వివిధ విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తెలిపారు. పి.హేమంత్ – కుమిటీ విభాగంలో బంగారు పతకం, కాటాలో వెండి పతకం సాధించాడు. బి.రేష్వంత్ – కాటా, కుమిటీ రెండింటిలో కాంస్యం గెలుచుకున్నాడు. కె.శివగణేష్ – కుమిటీలో బంగారు, కాటాలో వెండి, బి.షణ్ముఖ శ్రీకర్ – కుమిటీలో వెండి, బి.శివశ్రీ హర్షవర్దన్ – కాటాలో వెండి, ధనుష్ కృష్ణతేజ కాటాలో వెండి పతకాలు సాధించారని తెలిపారు. వీరిని శుక్రవారం గురుదత్త పాఠశాల కరస్పాండెంట్ పి.పద్మ, కోచ్ కె.సంతోష్ కుమార్ అభినందించారు.

దీపం కింద డీబీటీ ద్వారా రూ.164 కోట్ల బదిలీ

పార్వతీపురం టౌన్: దీపం పథకం క్రింద జిల్లాలో డీబీటీ ద్వారా రూ.164 కోట్లు బదిలీ కానుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలో దీపం–2 పథకం కింద 1,97,727 మందిని అర్హులుగా గుర్తించామని పేర్కొన్నారు. దీపం–2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. దీపం పథకంలో భాగంగా ఉచిత సిలిండర్లు పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం పార్వతీపురం పట్టణంలో పాత బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం పొందేందుకు ఆధార్ కార్డు నెంబరు, రేషన్/బియ్యం కార్డు నెంబరు, ఆధార్ నెంబరుతో లింకు చేసిన బ్యాంకు ఖాతా (ఎకౌంటు) నెంబరు, గ్యాస్ కనెక్షన్ నెంబరు ఉంటే సరిపోతుందని వివరించారు. లబ్ధిదారులు తమ వివరాలు లేకపోతే ఆయా సంస్థలు, శాఖల నుండి వివరాలు పొంది నమోదు చేసుకొని ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందవచ్చని ఆయన వివరించారు. దీపం పథకంలో భాగంగా లబ్ధిదారులు తమ గ్యాస్ ఏజెన్సీలో గ్యాస్‌కు బుకింగ్ చేసి గ్యాస్ ధర, గ్యాస్ ఏజెన్సీ వారికి మొదట చెల్లించాలని, అనంతరం అర్హులైన లబ్ధిదారుకు మొబైల్ నెంబరుకు మెసేజ్ వస్తుందన్నారు. మెసేజ్ వచ్చిన లబ్ధిదారుకు గ్యాస్ ఏజెన్సీకి చెల్లించిన మొత్తం నగదు తిరిగి వస్తుందని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల వారికి 24 గంటలల్లో, గ్రామీణ ప్రాంతాల వారికి 48 గంటల్లోగా వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా అందజేసేందుకు అక్టోబర్ 31 నుండి శ్రీకారం చుట్టిందని చెప్పారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి



వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటం వద్ద కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ దేశ తొలి ఉప ప్రధానిగా, హోం శాఖ మంత్రిగా పనిచేసి విశిష్ట సేవలందించారన్నారు. ఆయన జీవిత విశేషాలను తెలుసుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ జి.కేశవనాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రూ.60లక్షల ఆస్తి నష్టం

- ఆటోమొబైల్ దుకాణాంలో ప్రమాదం



అగ్నిప్రమాదంలో కాలి బూడిదైన ఆటో మొబైల్ దుకాణం

చీపురుపల్లి: దీపావళి పండగ రోజున ఓ ఆటోమొబైల్ దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు రూ.60లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఈ సంఘటనకు సంబందించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మెయిన్‌రోడ్‌లోని ఆంజనేయపురంలో మాధురి ఆటోమొబైల్ దుకాణాన్ని గెంబలి శ్రీనివాసరావు అనే దివ్యాంగ యువకుడు నిర్వహిస్తున్నాడు. శ్రీనివాసరావు దివ్యాంగుడైనప్పటికీ ఎంతో ధైర్యంతో 2016లోనే ఇక్కడ ఆటో మొబైల్ దుకాణాన్ని ఏర్పాటు చేసాడు. అప్పటి నుంచి వ్యాపారాన్ని విస్తరిస్తూ పట్టణంలో ప్రధాన ఆటో మొబైల్ దుకాణాల్లో ఒకటిగా నిలిపాడు. గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో ఆటో మొబైల్ దుకాణాంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో మంటలు చెలరేగాయి. దుకాణంలో అధిక సంఖ్యలో వాహన టైర్లు, ట్యూబ్‌లు ఉండడంతో మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ దుకాణంలో ఉన్న మొత్తం వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. రూ.60లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు యజమాని లబోదిబోమంటున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు శుక్రవారం ఉదయాన్ని సంఘటనా స్థలానికి వెళ్లి బాధితుడు శ్రీనివాసరావుకు ధైర్యం చెప్పి, భీమా కంపెనీల ప్రతినిధులతో న్యాయం చేయాలని మాట్లాడారు.

నా ఆధారం పోయింది

దివ్యాంగుడైనప్పటికీ కష్టపడి కుటుంబాన్ని పోషించుకోవాలని 2016లో ఆటో మొబైల్ దుకాణం ఏర్పాటు చేసానని బాధితుడు గెంబలి శ్రీనివాసరావు అన్నారు. అలా కష్టపడుతూ దుకాణ సామర్థ్యాన్ని పెంపొందించానని ఈ దుకాణం ఆధారంగానే కుటుంబాన్ని పోషించుకుంటున్నానని ఇప్పుడు అగ్నిప్రమాదం సంభవించడంతో సర్వం కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేసాడు.

జిల్లాకు మాజీ సైనికుల పాలీక్లినిక్ మంజూరు

- మాజీ సైనిక కుటుంబాలకు లబ్ధి

విజయనగరం అర్బన్: జిల్లాలో మాజీ సైనికుల కోసం నూతనంగా పాలీ క్లినిక్ (ఎక్స్ సరీ్వస్ మెన్ కంట్రిబ్యూటరీ హాస్పిటల్స్ స్కీమ్‌–ఈసీహెచ్ఎస్) ఆస్పత్రిని మంజూరు చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు డిఫెన్స్ మినిస్టీరియల్ కార్యాలయం నుంచి మంజూరైన ఈ.సి.హెచ్.ఎస్ జాబితాలో విజయనగరం ఉమ్మడి జిల్లా ఉంది. దీంతో విజయనగరం ఉమ్మడి జిల్లాలో దాదాపు 3500 మంది మాజీ సైనికుల కుటుంబాలకి వైద్య సౌకర్యం జిల్లా స్థాయిలో లభిస్తుంది. ఇంతవరకు జిల్లాలోని సైనిక కుటుంబాలు పక్క జిల్లాలైన శ్రీకాకుళం, విశాఖపట్నం వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. జిల్లాకు పోలీక్లినిక్ మంజూరు చేయడంపై జిల్లా నేతాజీ మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దింటి గుణకర్ తదితరులు హర్షం ప్రకటించారు. ఎన్నో ఏళ్ల నుంచి సంఘం చేసిన డిమాండ్ సాధించామని ఈ సందర్భంగా ఒక ప్రకటనలో తెలిపారు.

అండర్ -13 చెస్ క్రీడాకారుల ఎంపిక రేపు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్ – 13 బాల, బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 3న నిర్వహించనున్నట్టు చెస్ అసోసియేషన్ విజయనగరం జిల్లా కార్యదర్శి కెవి.జ్వాలాముఖి శనివారం తెలిపారు. ఎంపిక పోటీల్లో 2011 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. రింగ్‌రోడ్‌లో గల ఫైర్ చెస్ స్కూల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు విధిగా వారి జనన ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకు రావాలని సూచించారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 81791 35735 నంబరును సంప్రదించాలని సూచించారు.

పింఛన్ల పంపిణీ 96.76 శాతం

- ఇళ్ల వద్దకు కాదు సచివాలయ వద్ద పంపిణీ
- మండుటెండలో అవ్వాతాతలు పడిగాపులు

విజయనగరం అర్బన్: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ కానుక పంపిణీలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. శుక్రవారం తొలి రోజున 96.76 శాతం మందికి పెన్షన్ పంపిణీ చేసి రాష్ట్రంలోనే జిల్లా ఈ ర్యాంకు సాధించిందని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ తెలిపారు. వలంటీర్లు లేకపోవడంతో లబ్ధిదారులు జిల్లా వ్యాప్తంగా సచివాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చింది. వయసు మీరిన అవ్వాతాతలు మండుటెండలో సచివాలయాలకి వెళ్లాల్సి వచ్చింది. దీంతో గుంపులు గుంపులుగా సచివాలయాలకు వచ్చిన లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లకుండా పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు సర్వర్ సమస్యలతో పంపిణీ చేయని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని 12 రకాల పింఛన్లు 2,77,107 మందికి పంపిణీ చేయాల్సి ఉందని తెలిపారు. అయితే ఒక్కరోజులోనే 96.76 శాతంతో 2,68,131 మందికి పంపిణీ జరిగిందని తెలిపారు. జిల్లాలోని 27 మండలాల్లోనూ 95 శాతానికి పైగానే పంపిణీ జరిగిందని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు రామ్మోహన్‌రావు(ఫైల్)

సీతంపేట: ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతివేగం ఓ వ్యక్తి నిండు ప్రాణాన్ని బలిగొంది. మరొక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే... సీతంపేట మండలం హడ్డుబంగి–లోవగూడ గ్రామాల మధ్య ఉన్న అప్పలమ్మ వంతెన వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పాలకొండ మండలం ఎంకే రాజపురం గ్రామానికి చెందిన పైల రామ్మోహనరావు(27), ఆయన స్నేహితురాలు రేగిడి గ్రామానికి చెందిన కాజీపేట శ్రావణి కొత్తూరు నుంచి ద్విచక్ర వాహనంపై గురువారం వస్తుండగా వీరిని అప్పలమ్మ వంతెన వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొంది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108లో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రామ్మోహనరావు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. శ్రావణికి కుడి చేయి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి తండ్రి శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అమ్మన్నరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

రాజాం సిటీ: మండల పరిధి వీఆర్‌అగ్రహారం గ్రామానికి చెందిన బెజ్జి చిన్నమ్మ (93) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందిందని ఏఎస్ఐ రమణమ్మ శుక్రవారం తెలిపారు. రేకుల ఇంట్లో నివాసం ఉంటున్న చిన్నమ్మికి చుట్ట తాగే అలవాటు ఉంది. చూపు కనిపించని ఆమె చుట్టను పక్కనే పడేయడంతో బట్టకు అంటుకుని శరీరం కొంతభాగం కాలిపోయిందని ఏఎస్ఐ తెలిపారు. స్థానికులు గమనించి ఆమెను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందని పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

పండగ రోజు విషాదం



మృతుడు గనగళ్ల దానయ్య(ఫైల్)

భోగాపురం: దీపావళి పండగ రోజున మండలంలోని కొండ్రాజుపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన గనగళ్ల దానయ్య(15) అనే బాలుడు రామచంద్రపేట ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. గురువారం దీపావళి పండగ రోజు సెలవు కావడంతో తన స్నేహితులతో కలిసి గురువారం ఉదయం సముద్రంలో స్నానానికి వెళ్లాడు. సముద్రపు అలలు ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగసిపడడంతో అలల ధాటికి బాలుడు గల్లంతయ్యాడు. ఇది గమనించిన తోటి స్నేహితులు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న మత్స్యకారులు హుటాహుటిన సముద్రం లోపలికి వెళ్లి బాలుడు కోసం వెతికారు. బాలుడు ఆచూకీ ఎంతకీ కానరాకపోవడంతో తిరిగి వెనక్కి వచ్చేసారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ కిషోర్‌కుమార్ గ్రామానికి చేరుకుని మెరైన్ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. మరుసటి రోజు శుక్రవారం సాయంత్రం బాలుడు మృతదేహం సముద్రం ఒడ్డుకు కొట్టుకువచ్చింది. బాలుడు తల్లిదండ్రులు దానమ్మ, తాతయ్యలు కుమారుడి మృతదేహం వద్దకు చేరుకుని బోరున విలపించిన తీరు అందరినీ కలిచి వేసింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని వారికి ధైర్యం చెప్పారు.